సభలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

వాస్తవ చరిత్రను ముందు తరాలకు అందించాలి

- రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వాస్తవ చరిత్రను ముందు తరాలకు అందించాలని రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని పెన్షనర్స్ భవనంలో టీఎస్‌యూటీఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం–వాస్తవాలు, వక్రీకరణలు, అమరుల త్యాగాలు' అనే అంశంపై నిర్వహించారు. టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.నర్సింలు అధ్యక్షతన జరిగిన ఈ సభలో మల్లారెడ్డి మాట్లాడారు. హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ ప్రాంతాన్ని ఆనాడు నిజాం సైన్యం అండతో గ్రామాల్లోని జగీర్దార్లు, జమీందార్లు, దేశముఖ్‌లు, భూస్వాములు పాలించేవారని తెలిపారు. వారి కారణంగా ప్రజలు తీవ్ర అణచివేతకు గురయ్యారని.. అంటరానితనం, కుల వివక్ష, మహిళలపై లైంగికదాడులు నిత్యకృత్యంగా ఉండేవన్నారు. దాడులు తీవ్రస్థాయికి చేరుకోవడంతో ప్రజలంతా కుల, మతాలకతీతంగా ఏకమై కమ్యూనిస్టుల నాయకత్వంలో 1946 నుంచి 1948 సెప్టెంబర్ 17 వరకు రైతాంగ సాయుధ పోరాటాన్ని కొనసాగించారని చెప్పారు. ఈ కాలంలోనే భారత కమ్యూనిస్టు పార్టీ నిజాంకు చెందిన 10 లక్షల ఎకరాల భూములను ప్రజలకు పంపిణీ చేసిందన్నారు. తెలంగాణ ప్రాంతం భారత్‌లో విలీనమైన తర్వాత పోరాటాల ద్వారా సాధించుకున్న ఫలాలను పొందడానికి అదే పోరాటాన్ని 1951లో రక్షిత కౌలుదారు చట్టం వచ్చేదాకా కొనసాగించినట్టు వివరించారు. 'దున్నేవాడికే భూమి' అని నినాదించి హక్కులు సాధించుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు పి వెంకటరమణ, తెలంగాణ గిరిజన సంఘం నేత శ్రీనునాయక్, టిజెఎసి నేత జనార్ధన్, టిఎస్‌యుటిఎఫ్ నాయకులు బిజిలి సత్యం, ఎల్ బాలయ్య, వి కృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, లక్ష్మీదేవమ్మ, అరుణ, ఎల్ రాములు, జి శివారెడ్డి, వెంకటయ్య, రవికుమార్, వినీల్, నర్సింలు, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

- పోరు సలిపిన సకల జనులు
- నాడు స్వేచ్ఛ కోసమైతే.. నేడు హక్కుల కోసం పోరాడుదాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ పిలుపు
- నిజామాబాద్‌లో సెమినార్, బైక్ ర్యాలీ

సదస్సులో మాట్లాడుతున్న అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నాడు దొరల పాలనలో ఇంట్లో తినాలే.. దొరకాడ పని చేయాలే. అప్పుల చిట్టా అంటూ దొంగ లెక్కలు చూపుతూ తాతల నుంచి మనవళ్ల వరకు కొన్ని తరాలను వెట్టి చాకిరీ చేయించుకున్నారు. కులవృత్తుల వారు వారి పని చేసుకోకుండా దొరలు, పటేల్, పట్వారీల వద్ద పనులు చేయాల్సిందే. ఇంట్లో ఉన్న రోకలి బండతో సహా.. ప్రతి వస్తువుకు, పశువులకు పన్నులు కట్టాల్సిన పరిస్థితి. ఇలాంటి స్థితిలో స్వేచ్ఛ కోసం ఎర్రజెండా అండతో ప్రజలు పోరాటాల బాట పట్టారు. చిట్యాల ఐలమ్మ, దొడ్డి కొమరయ్యతో మొదలు సకల జనులు దొరలకు వ్యతిరేకంగా పోరాడారు. శాంతియుత నిరసనపై కాల్పులు చేపట్టడంతో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు సాయుధులై దొరలను గడీల నుంచి తరమికొట్టారు. అందుకే సెప్టెంబర్ 17ను తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినంగా నిర్వహిస్తున్నాం' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ తెలిపారు. ఆదివారం నిజామాబాద్‌లోని సిపిఎం కార్యాలయంలో 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వాస్తవాలు–వక్రీకరణ' అనే అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆ పార్టీ కార్యాలయం నుంచి నాందేవ్‌వాడ నుంచి హమాల్‌వాడీ బ్రిడ్జి, గాంధీ గంజ్, గాంధీ చౌక్ మీదుగా బస్టాండ్, రైల్వేస్టేషన్, ఎన్‌టిఆర్ చౌరస్తా నుంచి సుభాష్‌నగర్ మీదుగా పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ర్యాలీ పొడవునా.. కార్యకర్తలు, నాయకులు నినాదాలతో హోరెత్తించారు.

ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ.. దొర వద్ద వెట్టి చాకిరీ చేయడం ఇష్టం లేని చిట్యాల ఐలమ్మ తన నాలుగెకరాల్లో పంట సాగు చేసుకుంటే.. పండిన పంటను విసునూరు రామచంద్రారెడ్డి దొర తన గుండాలతో తీసుకెళ్లాడని తెలిపారు. దాంతో ఆమె సంఘం వారిని కలవగా.. వారు ఇచ్చిన ఎర్రజెండాను తన భూములో పెట్టుకొని పంట పండించిందని అన్నారు. దాన్ని సైతం తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన దొర గుండాలకు ఎదురుతిరిగిందని తెలిపారు. ఎర్రజెండా ఇచ్చిన ధైర్యం, అండ, విజ్ఞానంతో ఎదురుతిరిగింది. దొడ్డి కొమురయ్య సైతం వెట్టి నుంచి విముక్తి కల్పించాలని శాంతియుతంగా నిరసన చేపడితే.. కాల్పులు జరపడంతో పోరాటంలో తొలి అమరుడయ్యాడని తెలిపారు. ఇలా వెట్టి చాకిరి నుంచి ప్రజలకు విముక్తి కల్పించి.. దొరల ఆధీనంలో ఉన్న భూముల్లోంచి పది లక్షల ఎకరాలు పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదని అన్నారు. సర్దార్ పటేల్ వచ్చి ఏం చేశాడని పండుగ చేసుకోవాలని ప్రశ్నించారు. భారత సైన్యం ప్రవేశంలో మూడు రోజుల్లోనే నిజాం లొంగిపోగా.. సైన్యాలు తిరిగి వెళ్లిపోకుండా మళ్లీ గ్రామాలకు దొరలతో కలిసి వచ్చి వారి గుండాలతో కమ్యూనిస్టులే లక్ష్యంగా కాల్పులు జరిపారని తెలిపారు. ఈ పోరాటంలో 4000 మంది అమరులయ్యారని అన్నారు. కానీ నాటి పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బిజెపి, ఆర్ఎస్ఎస్.. నేడు పోరాటంపై వక్రీకరణలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగ పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా చూపించాలని ప్రయత్నిస్తున్నారని.. హిందువులుగా ఉన్న దొరలకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాటం చేశారని, నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిలో ముస్లిములు సైతం ఉన్నారని తెలిపారు. నాడు స్వేచ్ఛ కోసం పోరాడితే నేడు హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. రాబోయే తరాల కోసం, హక్కుల కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాటాలు చేపడదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, నూర్జహాన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకటేశ్, శంకర్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, యేశాల గంగాధర్, కొండ గంగాధర్, విఘ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎ, బిఎస్‌సి, బికాం, బికాం ఒకేషనల్, బికాం ఆనర్స్, బిఎస్‌డబ్ల్యు, బిబిఎ, బిసిఎ, బిబిఎం, బిసిఎ కోర్సుల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. సోమ, మంగళవారాల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలతోపాటు ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో (రెగ్యులర్ కోర్సులు మాత్రమే) స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుంది. వాటిలో స్థానికులకే ప్రవేశాలు కల్పిస్తారు. ఈనెల 17న ఆయా కాలేజీలు స్పాట్ అడ్మిషన్ల వివరాలను దోస్త్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈనెల 18,19 తేదీల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను చేపడతారు. స్థానికులతోపాటు స్థానికేతరుల (ఇతర రాష్ట్రాల విద్యార్థులు)కు ప్రవేశాలు కల్పించేందుకు అవకాశమున్నది. ఈనెల 20న ఆ వివరాలను దోస్త్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే స్పాట్ అడ్మిషన్లలో చేరిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌నకు అనర్హులవుతారు. ఇతర వివరాల కోసం ష్ట్రజూం://సశీర్.ఎస్ట్రస్త్ర.ప్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 2025–26 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో 967 డిగ్రీ కాలేజీలున్నాయి. వాటిలో 4,38,387 సీట్లున్నాయి. ఇప్పటి వరకు కేవలం 1,96,451 (44.81 శాతం) సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. డిగ్రీ కాలేజీల్లో ఇంకా 2,41,936 (55.19 శాతం) సీట్లు మిగిలి ఉన్నాయి. ఇందులో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) పరిధిలో 830 కాలేజీలుంటే 3,77,907 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు 1,69,012 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 2,08,895 సీట్లు మిగిలే ఉన్నాయి. ప్రముఖ డిగ్రీ కాలేజీల్లోనూ సీట్లు ఖాళీగా ఉండడం గమనార్హం. సీట్లు అందుబాటులో ఉండడంతో విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లలో చేరాలని అధికారులు కోరుతున్నారు.

దేశాభివృద్ధిలో వారిది కీలకపాత్ర

- ఇంజనీర్లకు సిఎం శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ మేధో శక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందించిన ఘనత ఇంజనీర్లదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజనీర్లరందరికీ ముఖ్యమంత్రి ఇంజనీర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ఆర్థికాభివృద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన సెప్టెంబర్ 15ను పురస్కరించుకొని, ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నారని సిఎం గుర్తుచేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీరుగా, దార్శనికుడిగా, విద్యాప్రదాతగా, నిపుణుడిగా, పారిశ్రామిక ప్రగతి చోదకుడిగా ప్రత్యేకతను చాటారని తెలిపారు. అత్యుత్తమ ఇంజినీరింగ్ సాంకేతికతతో వివిధ రంగాల్లో ఆయన చేసిన కృషి భారతదేశ ఇంజనీరింగ్ రంగానికి ఆదర్శంగా నిలిచాయని సిఎం చెప్పారు. మూసీ వరదల నుంచి హైదరాబాద్ నగరాన్ని రక్షించేందుకు జల నియంత్రణ ప్రణాళికలు, ఎన్నో గొప్ప నిర్మాణాలు చేపట్టటంలో ప్రత్యేక చొరవ చూపించారని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర,ఇంజనీరింగ్ విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు అందరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధిలో ఇంజనీర్స్ తమ వంతు పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

"అలయ్ బలయ్" కు రండి

- సిఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"అలయ్ బలయ్" కార్యక్రమంలో పాల్గొనాలని సిఎం రేవంత్ రెడ్డిని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. అక్టోబర్ 3న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే "అలయ్ బలయ్" కార్యక్రమానికి రావాలని కోరారు.

ఎడ్‌సెట్ రెండో విడతలో 7,441 మందికి సీట్ల కేటాయింపు

- 18 వరకు కాలేజీల్లో చేరేందుకు గడువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బీఎడ్ కోర్సులో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో 7,441 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఎడ్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ పాండురంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎడ్‌సెట్ రెండో విడతలో 12,076 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. బీఎడ్ కోర్సులో 10,005 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 7,441 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించాలని కోరారు. సోమవారం నుంచి ఈనెల 18 వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం https://tgedcetadm.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. ఎడ్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 17,151 మంది అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారు. బీఎడ్ కోర్సులో కన్వీనర్ కోటాలో 14,295 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 9,955 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. వారిలో 4,474 మంది రిపోర్టు చేశారు.

నేటినుంచి ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ ఎ శ్రీదేవసేన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. ఈనెల 16న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. అదేనెల 16,17 తేదీల్లో వెబ్‌ఆప్షన్లు నమోదు చేసేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. ఈనెల 20న ఐసెట్ తుదివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఈనెల 20 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. 22, 23 తేదీల్లో కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఇతర వివరాల కోసం https://tgicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీకి 9 అనుమతులిచ్చిన కెటిఆర్

- కాంగ్రెస్ నేత సంపత్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీకి బిఆర్ఎస్ హయాంలో కెటిఆర్ చేతుల మీదుగా తొమ్మిది అనుమతులిచ్చారని ఎఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఎ.సంపత్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గద్వాల సభలో కేటీఆర్ అన్ని అబద్ధాలే చెప్పారని ఆగ్రహం వ్యకం చేశారు. అలంపూర్ నియోజకవర్గంలో గెలిచిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలు పక్కన పెట్టి ఫ్యాడలిస్టు, శాడిస్ట్ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలంపూర్ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతున్నదని తెలిపారు. గ్రూప్ 1 ఉద్యోగాలు అమ్ముకున్నారని కేటీఆర్ ఒక్క సాక్ష్యం చూపిస్తే దేనికైనా రెడీ అని సవాల్ విసిరారు. గట్టు లిఫ్ట్ కేవలం ఓట్ల కొరకు సీట్ల కొరకు వాడుకున్నారే తప్ప దాని పూర్తి చేయలేదని సంపత్ కుమార్ విమర్శించారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్తారని సంపత్ కుమార్ హెచ్చరించారు.

నగరీకరణను అవకాశంగా మలుచుకోవాలి

- సామాజిక, ఆర్థిక కోణంలో సాంకేతిక పరిష్కారాలు అన్వేషించాలి
- ఆర్కిటెక్ట్ సదస్సులో హెచ్ఎంఆర్ఎల్ ఎమ్‌డి ఎన్‌విఎస్ రెడ్డి

మాట్లాడుతున్న ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శరవేగంగా పెరుగుతున్న నగరీకరణ ప్రక్రియను ఒక సమస్యగా కాకుండా దేశాభివృద్ధికి ఒక అవకాశంగా చూడాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎమ్‌డి ఎన్‌విఎస్ రెడ్డి అన్నారు. అధిక జనాభా, పర్యావరణ సమస్యలు, కాలుష్య నియంత్రణ, వేగంగా పెరుగుతున్న నగరీకరణ వంటి సవాళ్లను ఎదుర్కోడానికి ఆర్కిటెక్ట్‌లు తమ సాంకేతిక పరిజ్ఞానంతో వినూత్న ఆలోచనలు చేయాలని తెలిపారు. వీటికి సామాజిక, ఆర్థిక కోణంలో సాంకేతిక పరిష్కారాలను అన్వేషించాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన అఖిల భారత 'ఆర్కిటెక్చర్ రికనెక్ట్ సమ్మిట్'లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

మన దేశంలో అత్యధిక జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి ఉందని, దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే దేశ స్థూల సంపద (జిడిపి) పెరగాలని చెప్పారు. చైనా లాగా పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత ఇచ్చి, వ్యవసాయ రంగం నుంచి వీలైనంత మందిని పారిశ్రామిక రంగానికి మళ్లిస్తే నగరీకరణ ప్రక్రియలో భాగంగా మన దేశాభివృద్ధి మరింత శీఘ్రతరం అవుతుందని తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ గొప్ప ప్రజా రవాణా వ్యవస్థగా అంత్యంత ఆదరణ పొందడానికి అనేక కొత్త ఆవిష్కరణలే కారణమని అన్నారు. నగరాల్లో ట్రాఫిక్ రద్దీ సమస్యకు మంచి ప్రజా రవాణా వ్యవస్థే సరైన పరిష్కారమని చెప్పారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక, డిజిటల్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకుంటూనే, సంప్రదాయంగా వస్తున్న సహజసిద్ధమైన భవన నిర్మాణ సూత్రాలను జోడించి, ప్రజల జీవన విధానాన్ని మరింత సులభతరం చేయడంలో ఆర్కిటెక్ట్‌లు తగు మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు. నగరాల్లో ఎక్కువగా ఉన్న పేదరికం, సరైన గృహ సదుపాయాలు లేకపోవడం, ఆహ్లాదకరమైన బహిరంగ ప్రదేశాలు లేకపోవడం వల్ల నేరాల సంఖ్య పెరుగుతోందన్నారు. అందువల్ల గృహ నిర్మాణ రంగం అందరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి, వర్షాకాలంలో వరదనీటి ముంపు వంటి విపరీత పరిస్థితులను నగరాలు చవిచూస్తున్నాయని, వీటికి ఆర్కిటెక్ట్‌లు తగు పరిష్కార మార్గాలు అన్వేషించాలని తెలిపారు. వర్షపు నీటిని పొదుపు చేయడంలో సింగపూర్ చేపట్టిన చర్యలను ప్రస్తావిస్తూ, భూగర్భ నీటి స్థాయిని పెంచేలా తగు మార్గాలను అన్వేషించాలని, వర్షపు నీటిని ఒడిసి పట్టుకునే నిర్మాణాలు తమ ప్రాజెక్టుల్లో అంతర్భాగం కావాలన్నారు.

రవాణా ఆధారిత అభివృద్ధిపై ప్రత్యేక ఆలోచనలు చేయాలని, అందుకు అనుగుణంగా నగరాల్లో మెట్రో మార్గాల వెంబడి బహుళ అంతస్తుల నివాస గృహాలను, కమర్షియల్ కాంప్లెక్స్‌లను, విద్యా సంస్థలను అభివృద్ధి చేయాలని మెట్రో ఎమ్‌డి సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రధానంగా కర్బన ఉద్గారాలను తగ్గించడం ముఖ్యమని, హైదరాబాద్ మెట్రోరైల్ వ్యవస్థలో అటువంటి చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. తాము చేపట్టిన ఇంధన పొదుపు, పర్యావరణహిత చర్యల వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులను పొందడమే ఇందుకు తార్కాణమని చెప్పారు. హైదరాబాద్ మెట్రో ఎంతో ఆదరణకు నోచుకోవడానికి సుఖవంతమైన ప్రయాణం, ఇంధన పొదుపు, మహిళలకు తగు ప్రాధాన్యతను ఇవ్వడం ప్రధాన కారణమని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ఆర్కిటెక్ట్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తూ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్‌డి ఎన్‌విఎస్ రెడ్డి సందర్శించారు.

విద్యాహక్కు చట్టం సెక్షన్ 23ను సవరించాలి

- సుప్రీంకోర్టు తీర్పు నుంచి ఇన్‌సర్వీస్ టీచర్లకు రక్షణ కల్పించాలి
- ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రవి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు ఈనెల ఒకటో తేదీన ఐదేండ్ల పైబడి సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని, లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ ఇచ్చిన తీర్పు నుంచి సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టంలో సెక్షన్ 23ను సవరించాలని కోరారు. టెట్ సిలబస్, అర్హత ప్రమాణాలను శాస్త్రీయంగా సవరించాలని ఎన్‌సిటిఇని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ దోమల్‌గూడలోని టిఎస్‌టియుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని చావ రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అప్‌డేట్ కావటానికి తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే 2010, ఆగస్టు 23 కంటే ముందు నియామకమైన టీచర్లకు టెట్ మినహాయింపు ఇచ్చినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 15 ఏళ్ల తర్వాత హఠాత్తుగా రెండేళ్లలో పరీక్ష పాస్ కావాలంటే సీనియర్ టీచర్లు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ కారణంగా ఏర్పడే సంక్షోభాన్ని నివారించడానికి తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లను దాఖలు చేయాలని ఆయన కోరారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి)ని సవరించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లతో నిర్వహిస్తున్న దేశవ్యాప్త క్యాంపెయిన్‌లో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రవి

కెజిబివి, మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి : వెంకట్

ఈ రెండేళ్ల కాలంలో వీలైనన్ని ఎక్కువసార్లు టెట్ నిర్వహించి ఉంటే అవసరమైన ఉపాధ్యాయులందరూ ఉత్తీర్ణులయ్యేలా అవకాశం కల్పించాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. డిగ్రీ, బిఎడ్ అర్హతలతో ఎస్‌జిటిలుగా నియామకమైన ఉపాధ్యాయులకు ఒడిఎల్ (ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్) పద్ధతిలో జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)ల ద్వారా డిఎడ్ స్వల్పకాలిక శిక్షణను అందించాలని సూచించారు. తద్వారా టెట్ పేపర్–1 రాసుకోవడానికి అర్హత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని గురుకులాల టైంటేబుల్‌ను మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కెజిబివి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జంగయ్య, చావ దుర్గా భవాని, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, పత్రిక సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి, కుటుంబ సంక్షేమ నిధి చైర్మెన్ ఎం.రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు సిహెచ్.రాములు, కె.సోమశేఖర్, వి.శాంతికుమారి, ఎస్.మల్లారెడ్డి, డి.సత్యానంద్, కె.రవికుమార్, ఎ.సింహాచలం, బి.రాజు, వై.జ్ఞానమంజరి, ఎం.వెంకటప్ప, కుటుంబ సంక్షేమ నిధి కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్ విభాగం రాష్ట్ర నాయకులు మహేష్, సురేందర్, వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జియావుద్దీన్ అహ్మద్‌కు నివాళులర్పించారు.

దావా సమను

మహారాజశ్రీ పర్చూరు సినియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

O.S. No : 1/2023

Between:-
వజ్జా ఉదయ భాస్కర్ ..... వాది
V/s
అంబటి వెంకట వసుందరదేవి వగైరాలు ....ప్రతివాదులు

To,
D4) సాదినేని ఉమాచౌదరి w/o అజయ్ బాబు
R/o ప్లాట్ నెం.101, ఆకృతి రెసిడెన్సీ,
CZECK కాలనీ రోడ్ నెం.4,
సనత్ నగర్, యెర్రగడ్డ, హైదరాబాద్.18.

పై కోర్ట్ నందు వాది, ప్లయింటు పరిహారం నిమిత్తం, మీ పైదాఖలు చేయగా, సదరు దావా నందు మీ హాజరు నిమిత్తం వాయిదా ది. 06-10-2025. కావున మీరు పై కోర్ట్ వారి యెదుట వాయిదా తేదీన 06-10-2025న ఉదయం గం.10.30 ని.కు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమున వ్యవహారం తీర్మానంచేయబడునని, ఇందు మూలంగా తెలియ చేయుటమైనది.

// కోర్ట్ వారి ఉత్తర్వులు మేరకు //
వాయిదా తేదీ : 06-10-2025.
పర్చూరు.
తేదీ .12-09-2025. ఇట్లు
పోతిని సురేంద్ర
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి
పిటీషనరు/వాది తరపు అడ్వొకెట్స్

నోటీస్

మహారాజశ్రీ పర్చూరు సినియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

I.A. No : 1/2023
in
O.S. No : 1/2023.

Between:-
వజ్జా ఉదయ భాస్కర్ ..... పిటిషనరు
V/s
అంబటి వెంకట వసుందర దేవి. వగైరాలు ....రెస్పోండెంట్స్,

To
R4) సాదినేని ఉమాచౌదరి.
W/o అజయ్ బాబు
R/o ప్లాట్ నెం. 101, ఆకృతి రెసిడెన్సీ,
CZECK కాలనీ, రోడ్ నెం.4, సనత్ నగర్,
యెర్రగడ్డ, హైదరాబాద్. 18.

పై కోర్ట్ నందు పిటిషనరు, పిటిషన్ పరిహారం నిమిత్తం, మీ పై దాఖలు చేయగా, సదరు పిటిషను నందు మీహాజరు నిమిత్తం వాయిదా ది.06-10-2025. కావున మీరు పై కోర్ట్ వారి యెదుట వాయిదా తేదీన 06-10-2025న ఉదయం గం. 10.30ని.కు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయి మీఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున వ్యవహారం తీర్మానం చేయబడునని, ఇందుమూలంగా తెలియచేయుట మైనది.

// కోర్ట్ వారి ఉత్తర్వులు మేరకు //
వాయిదా తేదీ : 06-10-2025.
పర్చూరు.
తేదీ .12-09-2025. ఇట్లు
పోతిని సురేంద్ర
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి
పిటిషనరు/వాది తరపు అడ్వొకెట్స్

మహారాజశ్రీ
మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
(ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్)
ఐ.ఎ. 233/2021
ఇన్
ఎ.ఎస్. 3/2024

గోగిరెడ్డి నాసరరెడ్డి వగైరా..... పిటీషనర్లు/అప్పిలెంట్లు
వర్సెస్
ఉడుముల వెంగయ్య (డైడ్)
ఉడుముల రమణారెడ్డి వగైరా........... రెస్పాండెంట్లు

టు,
రెస్పాండెంట్లు :
8. ఉడుముల శ్రీరత్న, తండ్రి: ఉడుముల రమణారెడ్డి
9. ఉడుముల బేబి జ్ఞాపిక, తండ్రి: ఉడుముల రమణారెడ్డి
ఇద్దరూ కేరాఫ్/ ఉడుముల రమణారెడ్డి,
శ్రీకృష్ణా ఫార్మా స్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్,
ఐ.డి.ఎ. ఉప్పల్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.

ఈ నెంబరు పిటీషనర్లు/అప్పిలెంట్లు ఈ నెంబరు 1వ రెస్పాండెంట్ చనిపోయినందున, ఆయనకు వారసులుగా మిమ్ములను నిర్ధారించి ఈ అప్పీలులో మిమ్ములను 8మరియు9వ రెస్పాండెంట్లుగా చేర్చవలసినదిగా కోరుతూ ఈ పిటీషన్‌ను దాఖలు చేసినందున, అందుకు మీఆక్షేపణలు వినుటకు 06-10-2025వ తేదీకి వాయిదా వేయడమైనది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా లేదా మీ తరుపు వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీపరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 06-10-2025
మార్కాపురం, పురాణం సుబ్రహ్మణ్యం,
అడ్వకేట్, మార్కాపురం,
ప్రకాశం జిల్లా. ఆంధ్రప్రదేశ్.

IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE, KAKINADA
D.O.P. No.145 / 2025

Between:
Mortha Anil Kumar ...Petitioner
and
Mortha Durgabai @ Divya Sri ...Respondent

To: Mortha Durgabai @ Divya Sri,
W/o. Anil Kumar, D/o. Bulipe Subrahmanyam
Private Employee, D.No.5-3-73/1/C,
Street No.9, Bhavani Colony,
Premavathipeta, Rajandranagar Mandal,
Hyderabad - 500030.

పై నెంబరు కేసులో పిటీషనరు తన భార్య అయిన మీపై విడాకులు కోరుతూ దాఖలు చేసి యున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టువారి ద్వారా మీకు సమన్లు పంపించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున సదరు కేసులో **23-09-2025** తేదీన ఉదయం **10.30** ని॥లకు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

DUDALA LAKSHMANA RAO
Advocate, D.No.11-15-9
Opp. DMHO Office
Ramaraopeta, Kakinada
Cell: 8822112345

సాగుకోసం సాహసం

- ఉధృతంగా ప్రవహిస్తున్న నందివాగు
- ఏవుసం చేయాలంటే వాగు దాటాల్సిందే
- సదాశివపేట మండలం కంబాలపల్లిలో రైతుల పాట్లు
- శాశ్వతంగా బ్రిడ్జి నిర్మించాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులు తమ పంటపొలాల్లో సాగు చేయాలంటే సాహసం చేయాల్సిందే. తమ పొలాల్లోకి వెళ్లేందుకు వాగు దాటాల్సిందే. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగుకు వరద ఉధృతి పెరగడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటుతున్నారు రైతులు. లేదంటే సాగుకు దూరం కావాల్సిందే. ఇదంతా సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామంలోని రైతుల పరిస్థితి. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం కేంద్రంలోని నందివాగు ప్రాజెక్టు నుంచి కంబాలపల్లి గ్రామ పరిధి నుంచి నందివాగు ప్రవహిస్తుంది. భారీ వర్షాలతో వరద ఉధృతి పెరగడంతో నీటిని దిగువకు విడుదల చేశారు. దాంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇలా ప్రతి ఏడాది జూన్, జులై నుంచి డిసెంబర్ వరకు వాగు ప్రవహిస్తుంటుంది. ఈ సమయంలో పీకల్లోతు నీరు ప్రవహిస్తుండటంతో రైతులు అష్టకష్టాలు పడుతూ వాగు దాటుతుంటుంటారు. ఈ వాగుపై బ్రిడ్జి కట్టించాలని ఎన్ని సార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. దాంతో వాగును దాటేందుకు రైతులు ప్రత్యామ్నాయంగా థర్మాకోల్ షీట్‌తో తెప్పను ఏర్పాటు చేసుకున్నారు. ఈ తెప్ప ద్వారా గ్రామంలోని నంది వాగును దాటి ప్రాణాలతో చెలగాటం ఆడుతూ మరీ వ్యవసాయం చేస్తున్నారు.

కంబాలపల్లి గ్రామంలోని 100 మంది రైతులకు సంబంధించిన 150 ఎకరాల వరకు భూములు నందివాగు ఆవల ఉన్నాయి. ఆ భూముల్లోకి వెళ్లి సాగు చేసి పంటలు పండించాలంటే తప్పనిసరిగా వాగు దాటాల్సిందే. లేదంటే సాగుకు దూరం కావలసిందే. నందివాగు ప్రవాహం ఉధృతంగా ఉన్నప్పుడు దాటితే ప్రాణాలపై ఆశవదులుకోవాల్సిందే. ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాలంటే గ్రామం నుంచి మరో 15 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుంది. దాంతో దూరంభారం అవుతుంది. దాంతో వాగు దాటకతప్పని పరిస్థితి. కంబాలపల్లి రైతులు కూడా తమ పంట పొలాలను సాగు చేసుకునేందుకు నందివాగు దాటి వెళ్తున్నారు. ముఖ్యంగా జూన్, జులై నెలల్లో పీకల్లోతు నీళ్ల ప్రవహిస్తాయని రైతులు తెలుపుతున్నారు.

వర్షాల అనంతరం తాత్కాలిక వాగు నిర్మాణం

నందివాగు ఎప్పుడూ ప్రవహిస్తూ ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూనే వాగు వాటి మరీ పంటలు పండిస్తారు. వర్షాకాలం గడిచిన తర్వాత పెద్ద పెద్ద పైపులను వాగులో వేసి తాత్కాలిక బ్రిడ్జి నిర్మించుకుంటారు. ఆ బ్రిడ్జి ద్వారానే వాగును దాటి తాము పండించిన పంటలను తీసుకువస్తారు. కానీ వర్షాకాలంలో వచ్చే వరదలతో ఈ తాత్కాలిక వంతెన కొట్టుకుపోతుంది. దాంతో ఈ సమయంలో వాగు దాటేందుకు గ్రామ రైతులు థర్మాకోల్ షీట్లతో తెప్పను ఏర్పాటు చేసుకున్నారు. ఈ తెప్ప ద్వారా నదిని దాటేందుకు వాగు ఆవల ఉన్న చెట్లకు పెద్ద పెద్ద తాళ్లను కట్టి రైతులు తెప్పపై కూర్చుని తాడును లాగుతూ అవతలి గట్టుకు, ఈవలిగట్టుకు చేరుకుంటారు. పశువులకు వేయాల్సిన మేతను సైతం రైతులు తమ తలపై పెట్టుకుని తెప్ప ద్వారా గ్రామానికి చేరుకుంటారు. ఇలాంటి కష్టాల నుంచి విముక్తి కల్పించేందుకు నందివాగుపై శాశ్వతంగా బ్రిడ్జి నిర్మించాలని రైతులు వేడుకుంటున్నారు.

పంట పండించాలంటే వాగు దాటాలి : ఇందూరి బాబు, రైతు

వాగుకు ఆవల ఒక ఎకరం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. అందులో చెరుకు పంట సాగు చేస్తున్నాను. మా గ్రామం నుంచి ప్రవహించే నందివాగు ఎప్పుడూ పారుతూనే ఉంటుంది. నీళ్ల తక్కువగా ఉన్నప్పుడు నదిలో పైపులు వేసి దారి ఏర్పాటు చేసుకుంటాం. కానీ భారీ వర్షాలు పడ్డప్పుడు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాం. తప్పనిసరిగా వాగు దాటాల్సిందే. ప్రభుత్వం మా కష్టాలు తీర్చి దారి ఏర్పాటు చేయాలి.

వాగుదాటాలంటే తెప్ప నుంచి వేళ్లాల్సిందే : పాసుల ప్రభు, రైతు

నందివాగు ఆవల రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో పత్తి, కూరగాయలు సాగు చేస్తున్నాను. వర్షం వచ్చిందంటే వాగు ఉధృతంగా పారుతుంది. చాలా సంవత్సరాల నుంచి మాకు ఇదే బాధ ఉంది. వాగు దాటాలంటే తాము ఏర్పాటు చేసుకున్న థర్మాకోల్ తెప్పను ఆధారం చేసుకునే దాటాలి. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇంకోదారి నుంచి పోవాలంటే గ్రామానికి 15 కిలోమీటర్ల దూరం అవుతుంది. ప్రభుత్వం మా బాధలు తీర్చి శాశ్వతంగా బ్రిడ్జి నిర్మించాలి.

ప్రజాప్రతినిధుల బిల్లులు ఆగడం లేదు : ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాప్రతినిధుల మెడికల్ రీయింబర్స్‌మెంట్‌పై ఉన్న సీలింగ్‌ను ప్రభుత్వం ఎత్తేసిందని బిజెపి ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధుల బిల్లులు ఆగడం లేదనీ, ప్రభుత్వం వెంటనే చెల్లిస్తున్నదని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓ ప్రజాప్రతినిధి రెండు రోజులు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది బిల్లు పెట్టి వెంటనే ఆమోదింపజేసుకున్నారని గుర్తు చేశారు. అప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందా?అని ప్రశ్నించారు. ఒక్కో ప్రజాప్రతినిధి మోటార్ కారు అడ్వాన్స్ కింద రూ.50 లక్షల రుణానికి సంబంధించి బిల్లులు వెంటనే ఆమోదం పొందుతున్నాయని వివరించారు. కానీ ఉద్యోగులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలోనే ప్రభుత్వం వైఖరి భిన్నంగా ఉందని తెలిపారు. ప్రతినెలా రూ.700 కోట్లు పెండింగ్ బిల్లుల కోసం విడుదల చేస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. కానీ ఒక్క బిల్లు కూడా చెల్లించడం లేదని తెలిపారు. సంక్షేమ పథకాల బూచి చూపి ఎవరికీ డబ్బులు చెల్లించడం లేదని పేర్కొన్నారు.

కర్ర శ్రీహరి మృతికి కెటిఆర్ సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి మరణం పట్ల ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సంతాపం తెలిపారు. నాలుగు దశాబ్దాలపాటు సర్పంచ్, పాక్స్ చైర్మెన్, ఎంపీపీ, జెడ్పీటీసీగా ఎన్నో పదవుల్లో ప్రజా సేవ చేశారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి, పారదర్శకతకు ప్రతీకగా నిలిచారని ఆయన సేవలను గుర్తు చేశారు. ఆయన మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. నిజాయితీ, అంకితభావం, నిస్వార్థ సేవలతో ప్రజల గుండెల్లో చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఆయన ఎప్పటికీ నిలిచిపోతారని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి ఆయన మరణం తీరనిలోటని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

కెటిఆర్ ఆరోపణలను తిప్పికొట్టండి

- గ్రూప్ 1 అభ్యర్థులకు ఎంపి చామల సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్ 1 పరీక్షల్లో ఒక్కో అభ్యర్థి నుంచి రూ.3 కోట్ల చొప్పున తీసుకుని పోస్టులను అమ్ముకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలను తిప్పికొట్టాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక వీడియో సందేశం విడుదల చేశారు. 563 మంది అభ్యర్థులకు రూ.మూడు కోట్లు పెట్టే ఆర్థిక స్థోమత ఉందా? అనే విషయంలో ఎక్కడికక్కడ వీడియోలు చేసి కేటీఆర్ కు బుద్ధి చెప్పాలని సూచించారు. బిఆర్ఎస్ హయాంలో గ్రూప్స్ పరీక్షలు నిర్వహించలేదనీ, సిఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో అడ్డంకులు రాకుండా న్యాయనిపుణుల సలహాలు తీసుకుని ముందుకెళ్తున్నారని తెలిపారు. అయితే బిఆర్ఎస్‌కు ఓటేయని వారికి ఉద్యోగాలు రావొద్దనే కేటీఆర్ ఇలాంటి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనమే తప్ప కేటీఆర్ కు ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు.

అదనపు కట్నం కోసం.. భర్త అఘాయిత్యం

- భార్య గొంతు కోసి హత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుటుంబ కలహాలు, వరకట్నం వేధింపులు, మద్యపాన వ్యసనాలతో భర్త.. భార్య గొంతుకు కోసి హత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనర్సింహా కాలనీలో ఆదివారం జరిగింది. నాగోల్ సిఐ మహమ్మద్ మగ్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా కొనిజేడుకు చెందిన ఉప్పుతల్లి వేణుగోపాల్‌తో అదే జిల్లా కందుకూరుకు చెందిన మహాలక్ష్మికి 2024లో వివాహం అయ్యింది. వివాహ సమయంలో పుట్టింటి వాళ్లు 15 తులాల బంగారం, రూ.పది లక్షలు కట్నంగా ఇచ్చారు. మద్యానికి బానిసైన వేణుగోపాల్.. వివాహం అయిన కొంతకాలం నుంచే భార్యను హింసించేవాడు. మద్యం కోసం భార్య బంగారు ఆభరణాలనూ అమ్మేశాడు. మహాలక్ష్మి కొంత బంగారాన్ని పుట్టింట్లో ఉంచగా ఆ బంగారం తీసుకురావాలని వేధించేవాడు. ఇటీవల ఇద్దరి మధ్య గొడవలు కావడంతో పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా సమస్య సద్దుమణగలేదు. కాగా, ఆదివారం బంధువుల ఇంట్లో గృహప్రవేశం వేడుకకు రావాలని మహాలక్ష్మి వేణుగోపాల్‌ను కోరగా తనను చంపేస్తానని బెదిరిస్తూ జేబులో నుంచి పేపర్ కట్టర్ బ్లేడు తీసి ఆమె గొంతు కోశాడు. ప్రతిఘటించిన సమయంలో మహాలక్ష్మి కుడి చేతి చిటికెన వేలు తెగింది. భయంతో బయటకు పరుగెత్తడంతో ఇరుగుపొరుగువారు 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మహిళను వైద్యం కోసం ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఇతర మహిళలతో సంబంధాలు పెట్టుకోవడాన్ని ప్రశ్నించినందుకే తనపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బాధితురాలు మహాలక్ష్మికి ఆపరేషన్ పూర్తి చేశామని, ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని, 48 గంటల వరకు అబ్జర్వేషన్‌లో ఉంటుందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆదివారం సెలవయినప్పటికీ ఆర్థికపరమైన ఆలోచనలు చేయకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహాలక్ష్మికి ఆపరేషన్ చేశామని సుప్రజా ఆస్పత్రి ఎండీ విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ ఇన్‌ఛార్జులతో సీఎం సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ ఇన్‌ఛార్జులతో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ఎన్నికల్లో గెలుపు, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశానికి పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, వివిధ డివిజన్ల ఇన్‌చార్జులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు.

సిఎం కాలిగోటికి కెటిఆర్ సరిపోరు

- మెట్టు సాయి కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెటిఆర్ తలకిందులు తపస్సు చేసినా రేవంత్ రెడ్డి కాలిగోటికి సరిపోరని ఫిషరీస్ కార్పోరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్ల అధికారంలో ఉండి కెటిఆర్ బిసిలు, దళితులు, తెలంగాణ ఉద్యమకారులను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 లోక్ సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో సిరిసిల్లలో కెటిఆర్ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని హెచ్చరించారు.

రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తోన్న బిజెపి

- బిజెపి విధానాన్ని తిప్పికొడతాం
- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

సభలో మాట్లాడుతున్న చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి, ప్రజల మధ్య చీలికలు తెస్తున్న బిజెపి విధానాలను తిప్పికొడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి బాలమణి అధ్యక్షతన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వాస్తవాలు - వక్రీకరణలు' అనే అంశంపై నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సంస్థానంలో వెట్టిచాకిరీ, భావ వ్యక్తీకరణపై ఆంక్షలు, తెలుగు భాషపై అణచివేత, నిరంకుశ ధోరణులు కొనసాగాయని తెలిపారు. తెలుగు భాషా సంస్కృతులను రక్షించేందుకు ఏర్పాటైన ఆంధ్ర మహాసభ నిజాం నవాబ్ అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసిందన్నారు. 1946 నుంచి 1951 వరకు రైతులు, ప్రజలు నైజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన ఈ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమి ప్రజలకు పంచినట్టు తెలిపారు. 3000 గ్రామాలు విముక్తి అయ్యాయని, 4000 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఏనాడు పాల్గొనని బీజేపీ చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. నిజాం, భూస్వాములు, జాగీర్దార్లు, జమీందార్లు, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం ప్రజలు విరోచతంగా పోరాడారని తెలిపారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తుందన్నారు. హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలపై నిర్బంధాలను ప్రయోగిస్తుందని, రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను మార్చేందుకు కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు కట్టబెట్టాలనే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం. అడివయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ. మల్లేశం, కె. మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

గాంధీ మెడికల్ కాలేజీ 71వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాంధీ మెడికల్ కాలేజీ 71వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం కళాశాల అల్యూమినీ అసోసియేషన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. గాంధీ అల్యూమినీ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జిఆర్ లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య విద్యా అధ్యాపకులుగా పనిచేసి రిటైరైన ప్రొఫెసర్లు డాక్టర్ సుధారమణి, డాక్టర్ అరవింద్ కుమార్, డాక్టర్ అశోక్ కుమార్‌ను సన్మానించారు. గాంధీ మెడికల్ కాలేజీ వివిధ విభాగాల్లో యుజి, పిజి, సూపర్ స్పెషాలిటీల్లో ప్రతిభ కనబరిచి మెరిట్ సాధించిన 64 మంది వైద్య విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను అందించారు. పేద వైద్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి కొందరు పూర్వ విద్యార్థులు తమ వంతుగా రూ.20 లక్షల విరాళాలను సభా వేదికపై అల్యూమినీ అసోసియేషన్‌కి అందించారు. ఈ సందర్భంగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.వాణి మాట్లాడుతూ ఆస్పత్రిలో కొన్ని విభాగాల్లో వైద్య పరికరాలు అవసరం ఉన్నాయని చెప్పగానే అక్కడే ఉన్న పూర్వ విద్యార్థులు వాటిని సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించడం హర్షనీయమన్నారు. ఈ వేడుకల్లో అల్యూమినీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ డి.రాజారెడ్డి, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చైర్మెన్ డాక్టర్ పివి.నందకుమార్ రెడ్డి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మెన్ డాక్టర్ మహేష్, జిఎస్‌టి అడిషనల్ కమిషనర్ డాక్టర్ దొంతి, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై ఎలాంటి ఫిర్యాదూ లేదు

- డాక్టర్ మల్లు రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి పై మాకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ మల్లు రవి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ . భవన్‌లో మల్లురవి నేతృత్వంలో పిసిసి క్రమశిక్షణ కమిటీ భేటీ నిర్వహించారు. నేతల మధ్య విభేదాలు, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై కమిటీ చర్చించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన మల్లురవి తమకు ఫిర్యాదు రాలేదు కాబట్టే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయంలో చర్చ జరగలేదని స్పష్టం చేశారు. తమకు ఫిర్యాదు రావాలని లేదా పీసీసీ చీఫ్ అయినా చెప్పిన వాటిపై చర్చ ఉంటుందని వివరించారు. బహిరంగంగా మాట్లాడితే అది ఎదుటివారికంటే ఎక్కువ పార్టీకి నష్టం చేస్తుందని హితవు పలికారు. నేతల మధ్య విభేదాలపై స్పందిస్తూ స్థానిక ఎన్నికలు వస్తున్నాయని అందరూ సమన్వయం పాటించాలని కోరారు. ఏదైనా ఇబ్బందులుంటే తమకు, పీసీసీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. శ్రీరంగ నీతులు చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ గతంలో అవసరం లేకపోయినా ఎమ్మెల్యేలను బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నారని దుయ్యబట్టారు. కేటీఆర్ తాను తవ్వుకున్న గోతిలో తానే పడ్డారని విమర్శించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పందిస్తూ ఎమ్మెల్యేల అభిప్రాయానికి అనుగుణంగా స్పీకర్ నిర్ణయం ఉంటుందన్నారు. కమిటీ భేటీ సందర్భంగా దళిత నేతతో గొడవ విషయంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట డిసిసి అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసు ఇచ్చింది. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

బిజెపికి మద్దతిచ్చిన వ్యక్తి కోసం నాకు నోటీసులిచ్చారు : నర్సారెడ్డి

క్రమశిక్షణ కమిటీతో సిద్ధిపేట డిసిసి అధ్యక్షులు తాముకుంట నర్సారెడ్డి భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలతో తనపై అట్రాసిటీ కేసు నమోదు చేశారని కమిటీకి చెప్పానన్నారు. ఎంపి ఎన్నికల్లో బిజెపికి మద్దతు ఇచ్చిన వ్యక్తి ఫిర్యాదుపై నాకు నోటీసులు ఎందుకు ఇచ్చారో అర్థం కావడం లేదని చెప్పారు. తాను దళితుల సహకారంతోనే రాజకీయంగా ఎదిగానని దళితులకే ఎక్కువ పదవులు ఇచ్చినట్టు చెప్పారు.

నేటినుంచి కాలేజీలకు తాళం

- ఇంజనీరింగ్, వృత్తివిద్యా, డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధిక బంద్
- విద్యార్థులెవరూ కాలేజీలకు రావొద్దు : రవికుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్‌సహా వృత్తి విద్యా కాలేజీలు, డిగ్రీ, పీజీ కాలేజీలు సోమవారం నుంచి మూతపడనున్నాయి. కాలేజీలకు తాళం వేయాలని కాలేజీ యాజమాన్యాలు నిర్ణయించాయి. నిరవధిక బంద్ చేయనున్నట్టు ప్రకటించాయి. వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో ఇంజినీరింగ్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీఈడీ పరీక్షలను బహిష్కరించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.ఎనిమిది వేల కోట్లను వెంటనే విడుదల చేయాలంటూ ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఎటిహెచ్ఐ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. విద్యార్థులెవరూ కాలేజీలకు రావొద్దంటూ కోరుతున్నది. ఆదివారం హైదరాబాద్‌లో ఎఫ్ఎటిహెచ్ఐ అత్యవసర జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో ఎఫ్ఎటిహెచ్ఐ చైర్మన్ నిమ్మటూరి రమేష్‌బాబు మాట్లాడుతూ సోమవారం నుంచి కాలేజీలను నిరవధికంగా మూసేయాలని నిర్ణయించామని చెప్పారు. అటెండర్లు, స్వీపర్లు, ఫ్యాకల్టీ, యాజమాన్యాలు ఎవరూ రారనీ, కాలేజీలకు తాళాలు వేస్తామని ప్రకటించారు. ఈనెల 21 నాటికి ఆర్థిక శాఖ టోకెన్లు ఇచ్చిన నిధులు రూ.1,500 కోట్ల నుంచి రూ.1,800 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది కింద టోకెన్లు ఇచ్చిందన్నారు. వచ్చేనెల 31 నాటికి ఫీజు బకాయిల్లో సగం, మిగిలిన సగం డిసెంబర్ 31 నాటికి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి మార్చి 31 నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు విడతలు లేదా మూడు విడతల్లో ఫీజులను చెల్లిస్తామంటూ ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు. ఇతర విషయాల్లో ప్రభుత్వానికి యాజమాన్యాలు సహకరిస్తాయని అన్నారు. పాత బకాయిలు ఈ ప్రభుత్వానికి సంబంధం లేదనడం సరైంది కాదన్నారు.

రాజీవ్‌ను సన్మానిస్తున్న ఐఎంఎ బ్రాంచ్ సభ్యులు

పోస్టుల భర్తీ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం

- డాక్టర్ ఎం రాజీవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖలో రెండేళ్లలో అనేక పోస్టుల భర్తీ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని టిపిసిసి వైద్య, ఆరోగ్య విభాగం చైర్మన్ డాక్టర్ ఎం రాజీవ్ తెలిపారు. ఆదివారం కొంపల్లి ఐఎంఎ బ్రాంచ్ ఆధ్వర్యంలో రాజీవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ మార్పు కోసం సౌకర్యవంతమైన జీవితాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చినట్టు చెప్పారు. చదువుకున్న ప్రతి ఒక్కరు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని, సరైన నాయకులను ఎంచుకోవాలని, మంచి పనులు చేసే వారిని ప్రోత్సహించాలని సూచించారు. సమాజ సమస్యలపై మౌనం వీడి స్పందించాలని కోరారు. తనకు అవకాశం కల్పించిన మంత్రి శ్రీధర్ బాబు, పిసిసి అధ్యక్షులు బి మహేశ్ కుమార్ గౌడ్‌కు, వైద్యారోగ్యశాక మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం, వైద్యుల పోరాటాలకు అండగా ఉంటూ వారి గౌరవాన్ని నిలబెడుతానని రాజీవ్ తెలిపారు.

వైద్యుల ప్రతినిధిగా, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్‌గా ఆయన రాజీవ్ అందించిన సేవలను ఐఎంఎ బ్రాంచ్ వైద్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ బి.వెంకటేశ్వర్ రావు, కార్యవర్గ సభ్యులు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

బూర్గుల స్ఫూర్తిదాయక నేత

- మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత బూర్గుల రామకృష్ణారావు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయక నేత అని టిపిసిసి మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు. బూర్గుల రామకృష్ణారావు వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లిబర్టీ రోడ్ లోని ఆయన విగ్రహానికి మహేశ్ కుమార్ గౌడ్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్గుల దూరదృష్టి ఇప్పటికీ మనందరికీ ఆదర్శమని అన్నారు. ఆయన చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తూ ప్రజాసేవకు కట్టుబడి ఉందని తెలిపారు. యువతరానికి బూర్గుల మార్గదర్శి అని తెలిపారు.

బిఆర్ఎస్‌పై డిజిపికి ఫిర్యాదు చేస్తాం

- రియాజ్, చనగాని దయాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ విడుదల చేస్తున్న నకిలీ వీడియోలు, మాట్లాడిన క్లిప్పింగ్‌లపై డిజిపికి ఫిర్యాదు చేయనున్నట్టు రాష్ట్ర గ్రంథాలయ చైర్మెన్ రియాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్ 1 పోస్టులను అమ్ముకున్నారని ఆరోపణలు చేస్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని బిఆర్ఎస్ నాయకులు మానుకోవాలని పేర్కొన్నారు.

యూరియా బస్తాకు నిప్పు పెడుతున్న రైతులు

యూరియా బస్తాకు నిప్పు పెట్టి రైతుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలో రైతు ఆగ్రోస్ కేంద్రం వద్ద రైతులు యూరియా బస్తాకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ప్రగతి సింగారం ఆగ్రోస్ రైతు కేంద్రానికి ఆదివారం 450 బస్తాలు రాగా, అందులో నుండి 225 బస్తాలు వసంతాపూర్ కు, మిగిలిన 225 బస్తాలు శాయంపేట ఆగ్రోస్ రైతు కేంద్రానికి తరలించే క్రమంలో వసంతపూర్ గ్రామ రైతులు అడ్డుకున్నారు. ఎస్సై పరమేష్ సంఘటన స్థలానికి చేరుకొని రెండు రోజుల్లో మరో 225 బస్తాలు వసంతపూర్ రైతులకు అందజేస్తామని చెప్పడంతో శాంతించారు. అలాగే మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతి మడుగు రైతు వేదిక వద్ద యూరియా కోసం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ క్యూలోన్లో నిలుచున్నారు.